
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం, 4, మార్చి, 2024



‘ఆదర్శ’నికి ఆహ్వానం
ఏపీ మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.
8లో



టమాట కిలో రూ.12
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.4°/16.3°
జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పలుచోట్ల వేకువజామున చలి వాతావరణం నెలకొంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ‘స్పందన’



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ ‘స్పందన’ కార్యక్రమం ఉంటుందన్నారు. అర్జీలపై ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పక విచ్చేయాలన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో ‘స్పందన’
పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫెరెన్స్ హాల్లో సోమవారం ‘స్పందన’ నిర్వహిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీకి నేరుగా అర్జీలు అందజేయవచ్చు.

2.61 లక్షల పింఛన్ల పంపిణీ



అమడగూరు మండలం జేకేపల్లిలో పింఛన్ మొత్తం అందజేస్తున్న వలంటీర్ అరుణ

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా జిల్లాలో మూడో రోజు ఆదివారం నాటికి 2.61 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేశారు. 32 మండలాల పరిధిలోని 2,73,627 మంది లబ్ధిదారులకు రూ.81,67,37,500 విడుదలైంది. వలంటీర్ల సహకారంతో వీరిలో 2,61,272 మందికి రూ.77,97,52,500 నగదు పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మరో రెండు రోజులు పింఛన్ పంపిణీ ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్ చెప్పినట్టుగానే ప్రతి నెలా మొదటి 5 రోజుల్లోనే పింఛన్ మొత్తం అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ‘సెంట్రల్’ విద్యార్థులు

అనంతపురం: చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన మద్రాస్ విశ్వవిద్యాలయంలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఏపీ కేంద్రీయ విశ్వవిద్యార్థులు ఎంపికయ్యారు. సదస్సు 2వ రోజున ‘కవిత్రయ మహాభారతం – వర్తమాన సమాజం’ సమాలోచన అంశంపై పేపర్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఎంపికైన వారిలో ఎంఏ తెలుగు నాలుగో సెమిస్టర్ చదువుతున్న ఎస్‌హెచ్ భానుశ్రీ, పి.బాలు భీమ్‌రావు, రెండో సెమిస్టర్ విద్యార్థినులు బి.మహాలక్ష్మి, కె.అనిత ఉన్నారు. ఈ మేరకు తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ గరికపాటి గురజాడ, అధ్యాపకులు డా.బత్తల అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు.

బాబు భవిష్యత్‌కే గ్యారంటీ లేదు

- ప్రజలకేం గ్యారంటీ ఇస్తారు?
- బాబు అబద్ధపు హామీలు నమ్మకండి
- విశ్వసనీయతకు మారు పేరు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కదిరిలో ‘వైఎస్సార్ ఆసరా’ మెగా చెక్కు విడుదల చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో సమన్వయకర్తలు బోయ శాంత, మక్బూల్ అహ్మద్ తదితరులు



తనకల్లులో నిర్వహించిన ‘వైఎస్సార్ ఆసరా’ సభకు హాజరైన మహిళలు, ప్రజలు

కదిరి: ‘టీడీపీ అధినేత చంద్రబాబు మీ భవిష్యత్‌కు గ్యారంటీ నాది అని చెబుతున్నాడు. ఆయన భవిష్యత్‌కే గ్యారంటీ లేదు. ఇక మన భవిష్యత్‌కు ఏం గ్యారంటీ ఇస్తాడు’ అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం కదిరి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో జరిగిన ‘వైఎస్సార్ ఆసరా’ కార్యక్రమాల్లో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు 2014 సార్వత్రిక ఎన్నికల్లో 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. రుణమాఫీ పేరుతో రైతులను నట్టేట ముంచారని, ఇంటికో ఉద్యోగం అని చెప్పి నిరుద్యోగులను మోసగించారని, ఆఖరుకు అక్కచెల్లెమ్మలను కూడా డ్వాక్రా రుణమాఫీ పేరుతో వంచించారని విమర్శించారు. చివరకు తన ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి మాయం చేశారని, తాజాగా మరిన్ని అబద్ధపు హామీలతో ప్రజల ముందుకొచ్చారని విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీలకే దిక్కులేదు.. మళ్లీ వచ్చావా? అని ప్రశ్నించాలని, లేదంటే స్వయంగా ఆయన భార్య భువనేశ్వరి చెప్పినట్లు రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకోమని సలహా ఇవ్వండని మంత్రి సూచించారు.

మాటకు కట్టుబడే వ్యక్తి జగన్
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటమీద నిలబడే వ్యక్తి అని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నీ దాదాపు నెరవేర్చారని గుర్తు చేశారు. తాను ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందినట్లయితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ప్రజల్ని కోరుతున్నారన్నారు. ఈసారి ఎన్నికలు పేదలకు..పెత్తందార్లకు మధ్య జరుగుతున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడితే.. చంద్రబాబు పెత్తందార్ల పక్షాన ఉన్నారని.. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించి ఓటు వేయాలన్నారు.

జగనన్నకు జై కొడదాం
రాష్ట్రంలో ప్రజలు మెచ్చిన పాలనను జగనన్న అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బోయ శాంత అన్నారు. ఏ రాజకీయ నాయకుడి సిఫారసు లేకుండానే ఇప్పుడు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. అందుకే అందరూ ఫ్యాను గుర్తుకు ఓటువేసి మరోసారి జగనన్నను ఆశీర్వదించాలన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం
ప్రజాసేవ చేయడం కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మీకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం.. బలగం అని అన్నారు. ప్రతి కార్యకర్తా సైనికుడిలా పని చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. మనం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ మంత్రి షాకీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఎండీ ఇస్మాయిల్, బత్తల హరిప్రసాద్, వజ్ర భాస్కర్‌రెడ్డి, బత్తల వెంకటరమణ, సాదత్ అలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కలల్ని మింగిన అలలు

- సముద్రంలో గల్లంతైన ఇద్దరు విద్యార్థులు మృతి
- కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు




అప్పేచెర్ల శేషారెడ్డి, కుందనకోట పెద్దిరాజులు (ఫైల్)

యాడికి/పెద్దవడుగూరు: ఆ తల్లిదండ్రుల కలలు కల్లలైపోయాయి. అలల రూపంలో కంటి పాపల్ని మింగేశాయి. పుట్టెడు శోకం మిగిల్చాయి. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడు తమ కళ్లెదుటే విగతజీవిగా పడి ఉండడం చూసిన వారు గుండెలవిసేలా రోదించారు. తమిళనాడు రాష్ట్రం మహాబలిపురం వద్ద సముద్రంలో గల్లంతైన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వివరాలు.. యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు పెద్దిరాజులు(22), పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు శేషారెడ్డి(22) స్థానిక పెన్నా సిమెంట్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. రెండు రోజుల క్రితం తమ స్నేహితులు 22 మందితో పాటు పాటు నలుగురు అధ్యాపకులతో కలిసి మహాబలిపురానికి విహారయాత్రకు వెళ్లారు. శనివారం ఒడ్డున నిలబడి సముద్రాన్ని చూస్తుండగా, రాకాసి అల వచ్చి వీరిని సముద్రంలోకి లాక్కెళ్లింది. ఆదివారం మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మొదట శేషారెడ్డి మృతదేహం లభ్యం కాగా, కొద్దిసేపటికే పెద్దిరాజు మృతదేహం కనిపించింది.

తల్లడిల్లిన హృదయాలు..
కుందనకోటకు చెందిన పెద్దయ్య, లక్ష్మీదేవి దంపతులకు ఒక కుమారుడు పెద్దిరాజులు, ఒక కుమార్తె సంతానం. కూలి పనులు చేసుకుంటూనే కుమారుడిని చదివిస్తున్నారు. ఇక కొన్ని రోజుల్లో కోర్సు పూర్తవుతుంది.. ఉద్యోగం సంపాదించి మిమ్మల్ని బాగా చూసుకుంటా అంటూ పెద్దిరాజులు తల్లిదండ్రులకు ఎప్పుడూ చెప్పుండేవాడు. అలాంటి వాడు ఒక్కసారిగా లేడని తెలియడంతో పెద్దయ్య, లక్ష్మీదేవి శోకసంద్రంలో మునిగిపోయారు. ఇక మాకు దిక్కెవరయ్యా అంటూ గుండెలవిసేలా రోదించారు.

- పెద్దవడుగూరు మండలం అప్పేచెర్లకు చెందిన వెంకటరామిరెడ్డి, వెంకటలక్ష్మి దంపతులకు శేషారెడ్డి ఒక్కడే కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుమారుడిని అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. అలాంటి కుమారుడిని మృత్యువు కబళించి పుత్రశోకం మిగిల్చింది.

కదలి.. ‘రాం రాం’

- చంద్రబాబు సభలకు అసంతృప్తుల బెడద
- పెనుకొండలో దూరంగా బీకే వర్గీయులు
- రాబోమంటున్న పుట్టపర్తి అసమ్మతి నేతలు
- ధర్మవరంలో పట్టించుకోని పరిటాల శ్రీరామ్ వర్గం
- మడకశిరలో గుండుమల తిప్పేస్వామి అనుచరుల నిరసన
- జిల్లా వ్యాప్తంగా టీడీపీ ఇన్‌చార్జ్‌లకు తప్పని అసమ్మతి బెడద



మడకశిరలో నిరసన గుండుమల వర్గీయులు

సాక్షి, పుట్టపర్తి: ప్రతిపక్ష నేత చంద్రబాబు నిర్వహిస్తోన్న ‘రా.. కదలిరా’ సభలపై తెలుగు తమ్ముళ్లు భిన్నస్వరం వినిపిస్తున్నారు. ఎన్ని మర్యాదలు చేసినా.. తాము సభకు వచ్చేది లేదని ప్రతి నియోజకవర్గంలోనూ గ్రూపుగా ఏర్పడి నినదిస్తున్నారు. దశాబ్దాల పాటు టీడీపీ బలోపేతానికి కృషి చేసినా.. ఎలాంటి గుర్తింపు లేదని వాపోతున్నారు. ఇటీవల విడుదల చేసిన అభ్యర్థుల తొలి జాబితా గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని.. డబ్బులు గుమ్మరించిన వారికి టికెట్లు ఇచ్చారని విమర్శలు చేస్తున్నారు. సోమవారం పెనుకొండ నియోజకవర్గంలోని కియా పరిశ్రమ సమీపంలో ‘రా.. కదలిరా’ సభ జరగనుంది. ‘టికెట్ తీసుకున్నోళ్లు వెళ్లండి.. తమకు ఇన్నాళ్లు గుర్తింపు లేదు.. ఇప్పుడు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తే మేమెందుకొస్తాం’ అంటూ నిలదీస్తున్నారు. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఇరకాటంలో పడ్డారు.

- మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునిల్‌కుమార్‌కు టీడీపీ టికెట్ ఇచ్చారని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వర్గీయులు అలకబూనారు. జాబితా విడుదల రోజు నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం జిల్లా కురుబ సాధికార కమిటీ అధ్యక్షుడు గోవిందప్ప, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా వీరశైవ కమిటీ అధ్యక్షుడు దుర్గేష్, జిల్లా నాయీబ్రాహ్మణ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా టీఎన్‌టీయూసీ మూర్తి తదితరులు టీడీపీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మడకశిర అభ్యర్థిగా సునీల్ వద్దని. తక్షణమే మార్పు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు టీడీపీ పరిశీలకుడు గోవర్దన్‌రెడ్డి ఆదివారం మడకశిర ఆర్‌అండ్‌బీ బంగ్లాలో నిర్వహించిన సమావేశానికి గుండుమల తిప్పేస్వామి డుమ్మా కొట్టారు.
- చంద్రబాబు సభకు భారీ జనాలు తరలివెళ్లాలని పుట్టపర్తి టీడీపీ కార్యాయలంలో కార్యకర్తలతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం సమావేశమయ్యారు. అయితే అసమ్మతి నేతలు ఎవరూ హాజరు కాలేదు. పల్లెకు తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని చెబుతున్నారు.
- మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి వర్గీయులు ‘రా.. కదలిరా’ సభకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. పెనుకొండ అభ్యర్థిగా ఇటీవల ప్రకటించిన సవిత.. అన్నీ తానై వ్యవహరిస్తుండడంతో జీర్ణించుకోలేని బీకే వర్గం ఏర్పాట్లకు దూరంగా ఉంటున్నారు.
- తొలి జాబితాలో ధర్మవరం టికెట్ సస్పెన్స్‌లో పెట్టడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న పరిటాల శ్రీరామ్‌కు ఇస్తారా? లేక బీజేపీలో కొనసాగుతున్న వరదాపురం సూరికి ఇస్తారా? లేదా పొత్తులో భాగంగా బీజేపీకి ఇస్తారా? అనేది తేలలేదు. దీంతో చంద్రబాబు సభకు ఎందుకు వెళ్లాలని పరిటాల శ్రీరామ్ వర్గం అలకబూనినట్లు తెలిసింది.

మిగతా ప్రాంతాల్లోనూ..
ఐదేళ్ల పాటు ఎవరినీ పట్టించుకోకుండా.. ఎన్నికల సమయంలో ఉన్నఫళంగా జిల్లాకు విచ్చేసి ‘జనాలు తరలిరండి.. మద్దతు పలకండి’ అంటూ చంద్రబాబు ప్రసంగాలు ఇస్తుంటే వినడానికి ఎందుకెళ్లాలని కార్యకర్తలు అసమ్మతి రాగం వినిపిస్తున్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం



సానిపల్లిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

- తొలి రోజే 98.50 శాతం నమోదు
- 2,05,865 మంది పిల్లలకు చుక్కల మందు

పుట్టపర్తి రూరల్: పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కొండయ్య అన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్ 9వ సచివాలయం వద్ద ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో డీఆర్వో కొండయ్య, స్టేట్ మోడల్ ఆఫీసర్ డాక్టర్ విక్రమ్ రెడ్డి (యూనిసెఫ్) మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జిల్లా వ్యవసాయ సహాయ మండలి అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. డీఆర్వో కొండయ్య మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేసి చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేద్దామన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం అందరి బాధ్యత అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వంద శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. జిల్లాలో 1,915 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా 760 మంది సిబ్బంది, 34 రూట్లు, 62 జనసమూహ ప్రాంతాల్లో 2,09,015 మంది చిన్నారులకు గాను 2,05,865 మందికి చుక్కల మందు వేశారు. తొలిరోజే 98.50 శాతం నమోదైంది. మిగిలిన పిల్లల కోసం 59 మొబైల్ బృందాల ద్వారా ఈ నెల 4, 5 తేదీల్లో ఇంటింటికీ వైద్య బృందాలు వెళ్లి పోలియో చుక్కలు వేయిస్తామన్నారు. 304 మంది మెడికల్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా పల్స్ పోలియో కార్యక్రమంలో భాగస్వామ్యం అయినట్లు డీఆర్వో తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, డీఐఓ డాక్టర్ కృష్ణయ్య, జిల్లా ఆరోగ్య అధికారి వీరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలియోను తరిమికొడదాం
రొద్దం: రెండు చుక్కల మందుతో పోలియో మహమ్మారిని తరిమికొడదామని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. శనివారం సానిపల్లిలో చిన్నారులకు మంత్రి పోలియో చుక్కలు వేశారు. చిన్నారుల నిండు జీవితాలకు రెండు చుక్కల పల్స్‌పోలియో మందు వేయించాలని సూచించారు.

పల్స్ పోలియోను పరిశీలించిన డబ్ల్యూహెచ్‌ఓ అధికారి
పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్‌లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఎక్స్‌టర్నల్ మానిటరింగ్ ఆఫీసర్ శిరీష సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ఉన్న సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వంద శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఆదివారం వేయించుకోని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో ఇంటివద్దకే వెళ్లి చుక్కల మందు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో వెల్లువలా చేరికలు

- వైఎస్సార్‌సీపీలో చేరిన 985 కుటుంబాలు
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి



సభకు భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు వెల్లువెత్తుతుండటంతో అప్పుడే ఫ్యాన్ ప్రభంజనం కనిపిస్తోంది. ధర్మవరం మున్సిపాలిటీలో 985 కుటుంబాలు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. సంక్షేమ ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆదివారం పట్టణంలోని కాయగూరల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పై కుటుంబాలతో పాటు టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ గవ్వల నారాయణస్వామి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఏ వార్డు నుంచి ఎంతమందంటే..
పదో వార్డు నుంచి కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కృష్ణాపురం జమీర్ అహ్మద్, షాహీన్‌షా ఆధ్వర్యంలో 420 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. 11వ వార్డు కౌన్సిలర్ అత్తార్ జిలాన్‌బాషా ఆధ్వర్యంలో 120 కుటుంబాలు, 12వ వార్డులో కౌన్సిలర్ తొండమాల ఉమాదేవి, వార్డు ఇన్‌చార్జ్ తొండమాల రవి ఆధ్వర్యంలో 153 కుటుంబాలతో పాటు టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ గవ్వల నారాయణస్వామి వైఎస్సార్‌సీపీ తీర్థంపుచ్చుకున్నారు. 13వ వార్డు నుంచి వార్డు ఇన్‌చార్జ్ తీర్థాల రమణ, కౌన్సిలర్ తీర్థాల స్వర్ణలత ఆధ్వర్యంలో 90కుటుంబాలు, 14వ వార్డు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ ఆధ్వర్యంలో 138 కుటుంబాలు, 14వ వార్డు కౌన్సిలర్ గజ్జల శివ ఆధ్వర్యంలో 64 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

జనంతోనే జగన్ పొత్తు
రానున్న ఎన్నికల్లో జనంతోనే జగన్ పొత్తు పెట్టుకుంటారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఐదేళ్లలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పొత్తులను, జిత్తులను నమ్ముకుని ప్రతిపక్ష పార్టీలు ప్రజల్లో చులకనయ్యాయన్నారు. ఎన్నికల రణక్షేత్రంలో పెత్తందార్ల పక్షాన నిలిచిన టీడీపీని ఓడించి.. పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే రాష్ట్రంలో రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి ఉంటుందన్నారు.

రికార్డు స్థాయిలో అభివృద్ధి
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ధర్మవరంలో రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి రికార్డు సృష్టించామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.3,200 కోట్ల లబ్ధిని నియోజకవర్గ ప్రజలకు నేరుగా అందించామన్నారు. ప్రస్తుతం ధర్మవరంలో ఒకడు రూ.100 కోట్లతో టీడీపీ టిక్కెట్ కొంటామని చెబుతున్నారని, అంత డబ్బు పెట్టుబడి పెట్టిన వాడు.. రేపు ప్రజల నుంచి ఎంత వసూలు చేస్తారో ఆలోచించాలన్నారు. ప్రస్తుతం టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న పరిటాల శ్రీరామ్ కుటుంబం గతంలో రాసిన రక్త చరిత్రకు ప్రజలకు క్షమాపణ చెప్పి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. ఈ పెత్తందారులకు రానున్న ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంత పెద్ద ఎత్తున ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి పార్టీలోకి చేరడం ఆనందాన్ని కల్గించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డితో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ నాగరాజు, జమీర్‌అహ్మద్, షహీన్‌షా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన 420 కుటుంబాలు



తొండమాల రవి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన 153 కుటుంబాలు

క్లుప్తంగా

తగ్గిన ప్యాసింజర్ రైలు చార్జీలు

హిందూపురం అర్బన్: గుంతకల్లు – హిందూపురం మధ్య సంచరించే ప్యాసింజర్ రైలు ఛార్జీలు తగ్గాయి. రోజూ ఉదయం 6.30 గంటలకు హిందూపురం నుంచి బయలుదేరిన ప్యాసింజర్ రైలు (57438) 11.35 గంటలకు గుంతకల్లు చేరుతుంది. తిరిగి సాయంత్రం 4.15 గంటలకు గుంతకల్లు నుంచి బయలుదేరిన రైలు (57437) రాత్రి 9.10 గంటలకు హిందూపురానికి చేరుతుంది. కరోనా సమయంలో తగినంత మంది ప్రయాణికులు లేని కారణంగా అప్పట్లో చార్జీలను రైల్వే అధికారులు పెంచారు. హిందూపురం నుంచి అనంతపురానికి రూ.55, గుంతకల్లుకు రూ.155 చొప్పున వసూలు చేశారు. ఆదివారం నుంచి తగ్గిన చార్జీలు అమలులోకి వచ్చాయి. దీంతో హిందూపురం నుంచి అనంతపురానకి రూ.30, గుంతకల్లుకు రూ.90 చొప్పున ఇకపై చార్జీలు వసూలు చేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య సౌమ్య

అగళి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని మధుగిరి తాలూకా దొడ్డేరి హొబళి తిమ్మలాపురం గ్రామానికి చెందిన సిద్ధరాజు, శివన్న, శివకుమార్ (40) ఆదివారం ఉదయం మధూడి గ్రామానికి చింతకాయల వ్యాపారానికి వెళ్లారు. మధ్యాహ్నం ముగ్గురూ కలసి ఒకే ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. అగళి మండలం నరసంబూది సమీపంలోకి చేరుకోగానే మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లారు. ఘటనలో కింద పడిన ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి సహాయక చర్యలు చేపట్టే లోపు శివకుమార్ మృతి చెందాడు. సిద్దరాజు, శివన్నను స్థానికులు అగళిలోని పీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య సౌమ్యతో పాటు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న సౌమ్య ఘటనాస్థలానికి చేరుకుని భర్త మృతదేహంపై పడి రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. ఏఎస్‌ఐ శ్రీరాములు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'ఆదర్శా'నికి ఆహ్వానం

నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా 'ఏపీ మోడల్ స్కూళ్లు'

- 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 31 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు చేసుకున్న పాఠశాలలోనే ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష



జగరాజుపల్లిలోని ఏపీ మోడల్‌స్కూల్

పుట్టపర్తి అర్బన్/ హిందూపురం టౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లిష్‌పై పట్టు తప్పనిసరి. ఆంగ్లంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పూర్తి స్థాయిలో పట్టున్న వారు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నిరుపేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలనే సదుద్దేశంతో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్థాపించిన ఆదర్శ పాఠశాలలు నేడు కార్పొరేట్ విద్యకు పట్టుకొమ్మలుగా మారాయి. జగన్‌సర్కార్ చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారాయి. మెరుగైన విద్యాబోధనతో సత్ఫలితాలను రాబట్టుకుంటున్నారు. సీబీఎస్‌ఈకి అనుబంధంగా ఇందులో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 1న నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 31తో దరఖాస్తుకు చివరి గడువుగా నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా అందజేసిన దరఖాస్తుకు సంబంధించి జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు, ఫొటోను సదరు పాఠశాలలో అందజేయాలి. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చలానా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూళ్లలోనే ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఫలితాలను ఏప్రిల్ 27న వెల్లడిస్తారు.30న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్ ఉంటుంది. జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

టెన్త్ ఫలితాల్లో హవా

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు ఉంటున్నాయి. దీంతో ఏపీ మోడల్ స్కూళ్లల్లో పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. గత ఏడాది పదో తరగతి పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 1,929 మంది విద్యార్థులు హాజరుకాగా 1,392 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో అత్యధికులు 500కు పైగా మార్కులు సాధించడం గమనార్హం.

ఇంగ్లిష్ మీడియంలో బోధన

ఇంగ్లిషు మీడియం ప్రధానాంశంగా ఏపీ మోడల్ స్కూళ్లలో ఏటా విద్యార్థులు పెరుగుతూ వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఒక్కసారి 6వ తరగతిలో కాలుపెడితే... ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి అయ్యేవరకూ అక్కడే విద్యాభ్యాసం చేయవచ్చు. ప్రతి తరగతిలోనూ 80 మందికి అవకాశం కల్పిస్తారు. ఇంటర్‌లో ఒక్కో గ్రూపులో 20 మంది చొప్పున విద్యార్థులకు అవకాశం ఉంటుంది. నాణ్యమైన యూనిఫాం, టై, బెల్టు, షూ, పుస్తకాలు, ట్యాబ్‌లు, మధ్యాహ్న భోజనం, లైబ్రరీ, ప్రహరీ సౌకర్యం, విశాలమైన ఆటస్థలం ఉన్నాయి. సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్, లిప్ తదితర కార్యక్రమాలను అమలు చేస్తుండడంతో చాలా మంది విద్యార్థులు పోటీ ప్రపంచానికి దీటుగా రాణిస్తున్నారు.

ఒక్కో పాఠశాలలో 100 సీట్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆదర్శ పాఠశాలలు 25 ఉన్నాయి. రాప్తాడు, గార్లదిన్నె, పామిడి, గుత్తి, యాడికి, వజ్రకరూరు, ఉరవకొండ, విడపనకల్లు, రాయదుర్గం, కణేకల్లు, కళ్యాణదుర్గం, శెట్టూరు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, ధర్మవరం, పుట్టపర్తి, నల్లచెరువు, అమడగూరు, అగళి, అమరాపురం, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, హిందూపురం మండలాల్లోని ఒక్కో పాఠశాలలో ఆరో తరగతికి గతంలో 80 సీట్లు మాత్రమే కేటాయించేవారు. విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్‌కు జగన్ సర్కార్ సానుకూలంగా స్పందిస్తూ వంద సీట్లకు పెంచారు. ఈ లెక్కన 25 పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు దక్కనున్నాయి. ఒక్కో సీటుకు ఐదు నుంచి పది మంది విద్యార్థులు పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఆదర్శ పాఠశాల లేని మండలాల్లోని విద్యార్థులు సమీప మండలాల ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. సొంత మండల విద్యార్థులు లేని పక్షంలో మాత్రమే పక్క మండలాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. బాలికల కోసం ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఏపీ ఆదర్శ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయి. నాడు–నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సదుపాయాలు కల్పించింది. 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– అశోక్ నాయక్, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, హిందూపురం

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఏపీ మోడల్‌స్కూళ్లలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులంతా కలసి కట్టుగా పనిచేస్తున్నారు. పాఠ్యాంశాలు పూర్తయిన తర్వాత రివిజన్ వర్క్ ఉంటుంది. పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులకు రెండు గంటల పాటు అదనపు సమయం కేటాయించి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నాం.

– రజని, ఏపీఎంఎస్ ఉపాధ్యాయురాలు, బుక్కపట్నం

కార్పొరేట్‌కు మించిన వసతులు



రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఏపీ మోడల్ స్కూళ్లలో కార్పొరేట్‌కు మించిన వసతులు సమకూరాయి. వచ్చే ఏడాది ఆరో తరగతి ప్రవేశాలకు విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31వ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రతిభ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– మీనాక్షి, డీఈఓ.

గిరిజనుల ఆశాజ్యోతి సీఎం జగన్

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

పుట్టపర్తి రూరల్: గిరిజనుల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజనుల అభ్యున్నతికి ఇంతలా పాటుపడిన నాయకుడు ఎవరూ లేరన్నారు. ఏపీలో అమలవుతున్న సంక్షేమం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పేదల పక్షపాతిగా చెరగని ముద్ర వేసుకున్న సీఎం వైఎస్ జగన్‌ను రాబోవు ఎన్నికల్లో ఆదరించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రామ్, జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌నాయక్, రవికుమార్‌నాయక్, సోమ్లానాయక్, సుమతి భాస్కర్‌నాయక్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పని చేయాలని పార్టీ కమిటీ సభ్యులు, నాయకులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ బూత్ స్థాయి కమిటీ సభ్యులతో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల కానునందన్నారు. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు బూత్‌కమిటీ సభ్యుల వరకూ అందరూ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మోసపూరిత హామీలను వివరించాలన్నారు. ఇక బూత్‌ల వారీగా ఉన్న ఓటర్లను కుటుంబాల వారీగా విభజించుకుని ప్రచారం చేయాలన్నారు. మండల స్థాయి పార్టీ నాయకుల నుంచి బూత్ కమిటీ సభ్యుల వరకూ బాగా కష్టపడి పని చేస్తే గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కన్నా ఈసారి వచ్చే ఎన్నికల్లో మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మారుతి, ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, సమన్వయకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

పెనుకొండ: స్థానిక గగన్ మహల్‌లో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం(జలకవనం) అలరించింది. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ సంస్థ జిల్లా కన్వీనర్ హరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాయలసీమ జలసాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబరరెడ్డి తదితరులు హాజరయ్యారు. కవులు, రచయితలు తమ పాటలు, కవితల ద్వారా రాయలసీమ ఎదుర్కొంటున్న నీటి కరువు, అందుకు కారణాలు, పరిష్కారాలను చూపాలని ఈ సందర్భంగా వక్తలు కోరారు. రాయలసీమ అడుగుతున్న నీటి హక్కు ప్రాంతీయ తత్వం కాదన్నారు. అనంతరం కవులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసారు. సాహితీ స్రవంతి సభ్యులు కోగిర జయచంద్ర, రామన్న, యూటీఎఫ్ సుధాకర్, నారాయణస్వామి, రమేష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

గోదాముల తనిఖీ

కనగానపల్లి: మండల కేంద్రంలోని హౌసింగ్ గోదాములను ఆదివారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. స్థానిక హౌసింగ్ కార్యాలయం పక్కనే ఉన్న గోదాముల్లోని సిమెంట్ నిల్వలు, డోర్లు, ఇతర సామగ్రిని విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్ పరిశీలించారు. జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులకు ఈ సామగ్రిని సక్రమంగా అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శంకర్‌లాల్, ఏఈ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

సాయి ధర్మం.. ఆచరణీయం

ప్రశాంతి నిలయం: మానవాళికి మేలు చేయడమే లక్ష్యంగా ధర్మమార్గంలో సత్యసాయి ముందుకు సాగారని ఆయన భక్తులు సైతం అదే మార్గంలో ముందుకు సాగుతూ లోకకళ్యాణానికి పాటుపడాలన్న సందేశాన్నిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ విద్యార్థులు ఆదివారం 'విద్యావాహిణి' పేరుతో సందేశాత్మక నృత్యరూపకాన్ని నిర్వహించారు.

తలమర్లలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ

- 150 బీసీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



తలమర్లలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మాసుపల్లిలో వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం తలమర్ల, మాసుపల్లిలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి పని చేసిన 150 బీసీ కుటుంబాలు ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాము టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయం కోసం కృషి చేస్తూ వచ్చామని, అయినా పార్టీలో ఎలాంటి గుర్తింపునకు నోచుకోలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి పనులకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. సీఎం జగన్ పార్టీలో బీసీలను గుర్తించి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్ బడుగుల కోసం పని చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ రమణ, మంజ్లి ఆంజనేయులు, మాధవ, శ్రీరాములు, పోతన్న, మీసాల చిన్నయ్య, ఈడిగ రామమోహన్, నాగేంద్ర, ఈడిగ సత్తి, గాంగాద్రి, మంగలి వెంకటేష్, బాబు, రామచంద్ర, కిష్ట, నరేష్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మంజ్లి నాగప్ప, ధనుంజయ్, మంజ్లి చలపతి, మంజ్లి పెద్ద వెంకటేష్, చిన్న వెంకటేష్, హరి, అనిల్, భాస్కర్, మంజ్లి శివయ్య, తిరుపాల్, మురళి, శంకర్, శ్రీరాములు, గాలి మిషన్ చలపతి, లత, సుధా, రామలక్ష్మి, రూప, సంధ్యారాణి, సంజన, స్వరూప, మణి, సృజన, ఫక్రుద్దీన్, శివసాయి, రామాంజి, శీనా, రామమోహన్, రంగయ్య, రామకృష్ణ, సతీష్, అరుణమ్మ ఉన్నారు.

మాసుపల్లిలో..

సరేష్, ధనంజయ్, కవిత, అఖిల, ఆదిశేషు, కళావతి, చంద్ర, లక్ష్మీదేవి, సత్యం, చలపలి, శ్రీరాములు, కిష్టప్పతో సహా 15 కుటుంబాలు వారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీ రంగాదేవి, మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ఓబిరెడ్డి మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, బలిజ సంఘం నేత దాల్‌మిల్ సూరి, మటన్ శంకర్(జెడ్పీటీసీ భర్త) మండల పార్టీ కో ఆర్డినేటర్ రమణారెడ్డి, అంగడి సత్తి పాల్గొన్నారు.

చింతచెట్టు పైనుంచి పడి కూలీ మృతి



మృతుడు రవీంద్రారెడ్డి

పుట్టపర్తి అర్బన్: చింతచెట్టు పైనుంచి కిందపడి ఓ కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం ఓబుళంపల్లికి చెందిన రవీంద్రారెడ్డి (50) పదేళ్ల క్రితం వలస వచ్చి పుట్టపర్తి మండలం కప్పలబండలో స్థిరపడ్డాడు. భార్య శాంతమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో దంపతులిద్దరూ కూలి పనులకెళుతూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం కప్పలబండ గ్రామానికి చెందిన అమ్మినేని సరోజమ్మ పొలంలో చింతకాయలు దులపడానికి కూలీ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం చెట్టు పైకి ఎక్కి కాయలు దులుపుతుండగా అదుపు తప్పి రవీంద్రారెడ్డి కిందపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

మడకశిరరూరల్: మండలంలోని బుళ్లసముద్రం గ్రామ సమీపంలో రప్పంలో ఉన్న గొర్రెలపై ఆదివారం కుక్కలు దాడి చేశాయి. 14 గొర్రెలను చంపివేశాయి. గొర్రెల కాపరి శ్రీనివాసులు తెలిపిన మేరకు .... గొర్రెల రప్పంలో 30 చిన్న, పెద్ద గొర్రెలను ఉంచి మిగిలిన గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం కుక్కలు రప్పంలోకి ప్రవేశించి దాడి చేయడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.70 వేలకు పైగా నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న వెటర్నరీ అధికారులు మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు.

అరటి తోటకు నిప్పు



కాలిపోయిన అరటి చెట్లు

రొళ్ల: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి అరటి తోట దగ్ధమైంది. వివరాలు.. రొళ్ల మండలం ఎం.రాయాపురం గ్రామ రైతు తోట చిక్కన్న గారి నాగేంద్రప్ప గ్రామ సరిహద్దున కర్ణాటకలోని శిరా నియోజకవర్గం బడమారనహళ్లి పంచాయతీ పరిధిలో తనకున్న నాలుగు ఎకరాల్లో రెండేళ్ల క్రితం అరటి సాగు చేపట్టారు. రూ.7 లక్షలు ఖర్చు చేసి 3 వేల అరటి మొక్కలు నాటారు. మొదటి సంవత్సరం పంట చేతికి అందడంతో సుమారు రూ.6 లక్షల వరకూ ఆదాయం వచ్చింది. ప్రస్తుతం రెండో సారి పంట ఆశాజనకంగా ఉంది. నెల రోజుల్లోపు పంట కోతకు సిద్ధమయ్యాడు. ఈ లోపు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో పచ్చని మంటలు ఎగిసిపడ్డాయి. సుమారు వంద మందికి పైగా గ్రామస్తులు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పచ్చని చెట్లు, విద్యుత్ సర్వీస్ కేబుల్ వైర్, డ్రిప్ పరికరాలు కాలిబూడిదయ్యాయి. రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

వీఏహెచ్‌ఏలకు పోస్టింగ్

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్ఏ)లుగా ఎంపికైన వారికి ఆదివారం పోస్టింగ్ ఆర్డర్లను ఇచ్చారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్ సమక్షంలో తొలుత నాన్‌లోకల్ కింద ఎంపికైన వారికి పశుశాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, కలెక్టర్ ఎం.గౌతమి అనుమతులతో నియామక పత్రాలతో పాటు ప్లేస్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు. మిగిలిన సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా అందించనున్నారు. మొత్తంగా 439 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. కార్యక్రమంలో పశుశాఖ ఏడీలు డాక్టర్ బి.నాగార్జునరెడ్డి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, వీఏఎస్ డాక్టర్ గోల్డ్‌స్మన్, సూపరెండెంట్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.